సాక్షి
అనంతపురం

బుధవారం । 10 । సెప్టెంబర్ । 2025



యూరియా కోసం ఆందోళన
కణేకల్లు క్రాస్‌లో ఉన్న కోరమాండల్ వద్ద మంగళవారం యూరియా కోసం రైతులు ఆందోళనకు దిగారు.
8లో



'సూపర్' వంచన
తొలి ఏడాదిలో ఒక్క పథకానికీ పైసా ఇవ్వని బాబు సర్కారు సూపర్ హిట్ అంటూ సభ నిర్వహిస్తుండడంపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
8లో

గరిష్ఠం/కనిష్ఠం
35.8°/ 21.4°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

కర్షక లోకం కన్నెర్ర



అనంతపురంలో నిర్వహించిన అన్నదాత పోరు ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు, రైతులు

బాబు సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ర్యాలీలో ప్లకార్డు ప్రదర్శిస్తున్న రైతు

కర్షక లోకం కన్నెర్ర చేసింది. దగా చేస్తున్న కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు తరంగమై కదిలి వచ్చింది. బూటకపు మాటలతో మాయ చేస్తున్న సీఎం చంద్రబాబుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేసింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాలోని అనంతపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లు రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో జరిగిన 'అన్నదాత పోరు' కార్యక్రమం విజయవంతమైంది. ర్యాలీల్లో వైఎస్సార్ సీపీ శ్రేణుల తోడుగా రైతులు కదం తొక్కారు. వేలాది మందితో ఆయా ప్రాంతాల్లో రహదారులు కిక్కిరిసిపోయాయి.

- బూటకపు సర్కారుపై భగ్గుమన్న అన్నదాతలు
- వైఎస్సార్ సీపీ తోడుగా కదం తొక్కిన రైతన్నలు
- సీఎం చంద్రబాబుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు
- ఎరువుల బ్లాక్‌మార్కెటింగ్, యూరియా కొరతపై మండిపాటు
- వైఎస్సార్ సీపీ 'అన్నదాత పోరు' విజయవంతం
- వ్యవసాయానికి చంద్రబాబు పీడ: పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత ధ్వజం

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం రెవెన్యూ డివిజన్‌కు సంబంధించి జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి క్లాక్‌టవర్ మీదుగా ఆర్‌డీఓ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీలు మంగమ్మ, వై.శివరామిరెడ్డి, మాజీ మంత్రి, పార్టీ శింగనమల నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ సాకే శైలజానాథ్, రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, తాడిపత్రి నియోజకవర్గ సమన్వయకర్త పెద్దారెడ్డి పాల్గొని ఆర్‌డీఓ కార్యాలయంలో ఆర్‌డీఓ కేశవనాయుడుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు వై.ఈశ్వర ప్రసాద్ రెడ్డి, పార్టీ అనంతపురం పార్లమెంటు పరిశీలకులు నరేష్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణ రెడ్డి, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, పీఏసీ సభ్యులు మహాలక్ష్మి శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర నాయకులు రమేష్‌రెడ్డి, రమేష్ గౌడ్, ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు అశ్వర్థ్ నాయక్, మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్ ఘర్ రిజ్వాన్ పాల్గొన్నారు.



అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడుకు వినతిపత్రం సమర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, చిత్రంలో శైలజానాథ్, శివరామిరెడ్డి, మంగమ్మ, పెద్దారెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, మహాలక్ష్మి శ్రీనివాస్, వెన్నపూస రవీంద్రారెడ్డి, వీరాంజనేయులు, రమేష్ గౌడ్ తదితరులు

రైతుల్ని బాధపెడితే ప్రభుత్వాలే కూలుతాయి



అన్నం పెట్టే రైతన్నను బాధపెడితే ప్రభుత్వాలు కూలిపోతాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఏనాడూ రైతుల ప్రయోజనాలపై దృష్టి సారించలేదు. కూటమి ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే యూరియా బ్లాక్‌మార్కెట్‌కు తరలిపోయింది. వ్యవసాయానికి చంద్రబాబు అనే తెగులు, చీడ పట్టుకుంది. ఓ వైపు తుంగభద్ర, శ్రీశైలం నుంచి నీరు సముద్రం పాలవుతుంటే.. మరోవైపు జిల్లాలో సౌత్, నార్త్ కెనాల్‌కు నీరు ఇవ్వలేని దుస్థితి నెలకొంది. జిల్లా ప్రజలను పస్తులు పెట్టి కుప్పానికి నీరు తరలించడం సరికాదు. హంద్రీ–నీవా వెడల్పుతో పాటు హెచ్ఎల్‌సీ ద్వారా ప్రజలకు నీరందించాలి.

– అనంత వెంకటరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

- కళ్యాణదుర్గంలో వాల్మీకి సర్కిల్ నుంచి ఆర్‌డీఓ కార్యాలయం వరకు జరిగిన ర్యాలీలో పార్టీ శ్రేణులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ కళ్యాణదుర్గం, రాయదుర్గం సమన్వయ కర్తలు తలారి రంగయ్య, మెట్టు గోవిందరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు తిప్పేస్వామి, మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్‌డీఓ కార్యాలయ ఏఓ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందించారు.
- గుంతకల్లులో నిర్వహించిన ర్యాలీలో పార్టీ శ్రేణులు, రైతులు కదం తొక్కారు. ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాల నుంచి రైతులు తరలివచ్చారు. పార్టీ గుంతకల్లు నియోజకవర్గ సమన్వయకర్త వై.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆర్‌డీఓ కార్యాలయ ఏఓ నాగభూషణంకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ భవాని, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గాదిలింగేశ్వర బాబు, జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న పాల్గొన్నారు.

గతంలో ఎన్నడూ ఇలా లేదు



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏనాడూ రైతులు రోడ్డెక్కలేదు. ఇప్పుడు రైతులకు న్యాయం చేయకుండా సీఎం సభలు నిర్వహించడం సరికాదు. నాసిరకమైన విత్తనాల పంపిణీతో పాటు యూరియాను బ్లాక్ మార్కెట్‌లో విక్రయించేలా చేసి నేడు విజిలెన్స్ విచారణ అంటూ ప్రభుత్వం డ్రామాలాడుతోంది.

– తలారి రంగయ్య, పార్టీ కళ్యాణదుర్గం సమన్వయకర్త

అన్నదాతలకు అన్యాయం



సీఎం చంద్రబాబు జీవితమంతా మోసమే. ఎన్నికలకు ముందు అలవిగాని హామీలను ఇచ్చి రైతులకు తీరని అన్యాయం చేశారు. రైతులు రోడ్లపైకి వచ్చి గగ్గోలు పెట్టే స్థితికి తీసుకువచ్చారు. రైతులను ఆయన ఏవిధంగా దగా చేశారో చెప్పాల్సిన పనిలేదు. సీఎం చంద్రబాబుది ప్రచార ఆర్భాటం తప్ప ఇంకేమీ లేదు.

వై.వెంకటరామిరెడ్డి, గుంతకల్లు నియోజకవర్గ సమన్వయకర్త

మోసం బాబు నైజం



దివంగత నేత వైఎస్సార్ రైతుల కష్టాలను చూసి ఉచిత విద్యుత్ ఇవ్వాలని చూస్తే కరెంటు తీగలపై బట్టలు ఆరేసుకోవాలని ఎద్దేవా చేసిన ఘనుడు చంద్రబాబు. 2014కు ముందు రుణమాఫీ చేస్తామని చెప్పి తర్వాత రైతులకు అత్యాశ పనికిరాదంటూ మోసం చేశాడు. అనంతపురంలో ఎయిమ్స్, ఏరో స్పేస్ పరిశ్రమ తదితర హామీలిచ్చి మాట తప్పారు.

– ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి, మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు

ప్రభుత్వం కళ్లు తెరిపించేందుకే



రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. చివరకు యూరియా కోసం పడిగాపులు కాయాల్సిన దుస్థితి దాపురించింది. ఐఏబీ సమావేశం ఏర్పాటు చేయకపోవడంతో హెచ్ఎల్‌సీకి నీరు విడుదల కాక రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ ఇవ్వకుండా సీఎం చంద్రబాబు ఉత్త మాటలు మాట్లాడుతున్నారు. ప్రభుత్వం కళ్లు తెరిపించేందుకే 'అన్నదాత పోరు' చేపట్టాం.

– డాక్టర్ సాకే శైలజనాథ్, మాజీ మంత్రి

చంద్రబాబు రైతు వ్యతిరేకి



సీఎం చంద్రబాబు రైతు వ్యతిరేకి. 'అన్నదాత సుఖీభవ' సాయంలోనూ రైతులకు తీరని అన్యాయం చేశారు. ప్రజలన్నీ గమనిస్తున్నారు. రానున్న రోజుల్లో తప్పక బుద్ధి చెబుతారు. – వై.శివరామిరెడ్డి, ఎమ్మెల్సీ

రైతులను నట్టేట ముంచారు



సీఎం చంద్రబాబు రైతులను నట్టేట ముంచారు. ఎరువులు కూడా అందించకుండా పొట్టకొట్టారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో రైతులకు గిట్టుబాటు ధరతో పాటు అన్ని సౌలభ్యాలు కల్పించారు. కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి.

– తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, పార్టీ రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త

రైతులను రోడ్డుపాలు చేశారు



కూటమి పాలనలో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. విత్తనాల నుంచి ఎరువుల వరకు అన్యాయం జరిగింది. అన్నదాత సుఖీభవలో అర్హులకు అన్యాయం చేశారు. రైతాంగాన్ని సీఎం చంద్రబాబు సంక్షోభంలోకి నెట్టారు.

– నారాయణ రెడ్డి, పార్టీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు



గుంతకల్లులో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వైవీఆర్, పార్టీ నేతలు, రైతులు

విన్నవించినా నిర్లక్ష్యం



ఖరీఫ్, రబీలో తీవ్రంగా నష్టపోయాయినా ప్రభుత్వం నుంచి రైతులకు ఎటువంటి సాయం అందలేదు. దీనిపై గతంలోనే వైఎస్సార్ సీపీ తరపున ప్రభుత్వానికి విన్నవించినా నిర్లక్ష్యం చేశారు.

– మెట్టు గోవింద రెడ్డి, రాయదుర్గం సమన్వయకర్త



పార్టీ శ్రేణులతో కలిసి కళ్యాణదుర్గంలో ఆర్డీఓ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్తున్న వైఎస్సార్ సీపీ రాయదుర్గం, కళ్యాణదుర్గం సమన్వయకర్తలు మెట్టు గోవింద రెడ్డి, తలారి రంగయ్య

కేసులు నమోదు చేస్తామనడమేంది బాబూ



యూరియా అందక రైతులు సోషల్ మీడియా వేదికగా మాట్లాడితే వారిపై కేసులు నమోదు చేస్తామని సీఎం చంద్రబాబు చెప్పడమేంటి? అధికారులతో గణాంకాలు తెప్పించుకోవడమే కాదు, క్షేత్రస్థాయిలో రైతులకు యూరియా అందిందో లేదో చంద్రబాబు తెలుసుకోవాలి. యూరియాను పక్కదారి పట్టించిన వారిపై కేసులు నమోదు చేయాలి.

– నరేష్‌కుమార్ రెడ్డి, పార్టీ పార్లమెంట్ పరిశీలకులు

మోసానికి బ్రాండ్ అంబాసిడర్



మోసానికి చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్. అధికారం కోసం ప్రజలకు అలవిగాని హామీలు ఇచ్చి మోసం చేశారు. సూపర్ సిక్స్ హామీల్లో రెండు పథకాలను అసలు అమలే చేయలేదు. మిగిలిన వాటిని కూడా అరకొరగా అమలు చేసి చేతులు దులుపుకున్నారు. అయినా నేడు ఏం ముఖం పెట్టుకుని జిల్లాకు వస్తున్నారో అర్థం కావడం లేదు.

– గోరంట్ల మాధవ్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి

అవహేళన చేస్తారా?



రైతులు రోడ్డెక్కి ఇబ్బందులు పడుతుంటే వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అవహేళనతో మాట్లాడడం సరికాదు. గతంలో రైతులకు మేలు చేసేందుకు ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్, జలయజ్ఞం తదితర వాటిని అవహేళన చేసిన చరిత్ర చంద్రబాబుది.

– రమేష్‌గౌడ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి

నేడు జిల్లాలో పాఠశాలలకు సెలవు

- రెండో శనివారం 13న పాఠశాలలు పనిచేయాలంటూ ఆదేశం
- ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు

అనంతపురం ఎడ్యుకేషన్: ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా పర్యటన నేపథ్యంలో బుధవారం జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. చంద్రబాబు పాల్గొనే 'సూపర్ సిక్స్–సూపర్ హిట్' కార్యక్రమానికి పాఠశాలలకు ఎలాంటి సంబంధం లేదు. జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బస్సులన్నీ ముఖ్యమంత్రి కార్యక్రమానికి జనాలను తరలించేందుకు తీసేసుకున్నారు. ఆర్టీఏ అధికారులు దగ్గరుండి ఏ ఒక్క బస్సునూ వదల్లేదు. మంగళవారం సాయంత్రమే స్వాధీనం చేసుకున్నారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలకు ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆ యాజమాన్యాలే కాకుండా తక్కిన అన్ని యాజమాన్యాల స్కూళ్లకు సెలవు ప్రకటించాలని విద్యాశాఖ అధికారులపై ఒత్తిళ్లు వచ్చిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం సాగుతోంది. కాగా నేటి సెలవుకు బదులుగా రెండో శనివారం (ఈనెల 13న) అన్ని యాజమాన్యాల పాఠశాలలు పని చేయాల్సి ఉంటుందని డీఈఓ స్పష్టం చేశారు. మంగళవారం మధ్యాహ్నం డీఈఓ నుంచి ఆదేశాలు రాగానే డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, హెచ్ఎంలు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు ఆయా స్కూళ్లకు సెలవు ప్రకటించారు.

సీఎం వస్తే పాఠశాలలకు సెలవు ఇవ్వడం దౌర్భాగ్యం

'సూపర్ సిక్స్ సూపర్ హిట్' పేరుతో ప్రభుత్వం నిర్వహిస్తున్న పబ్లిక్ మీటింగ్ నేపథ్యంలో పాఠశాలలకు సెలవు ప్రకటించడం దౌర్భాగ్యమని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు మండిపడ్డారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గిరి, కార్యదర్శి ఓతూరు పరమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి మంగళవారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పాఠశాలలకు సెలవు ఇవ్వడం అంటే టీడీపీ మీటింగ్ కోసం విద్యార్థులను చదువుకు దూరం చేయడమేనన్నారు. కూటమి ప్రభుత్వానికి విద్యార్థుల మీద కానీ ప్రభుత్వ విద్యాసంస్థలను కాపాడడంపై గానీ ఏమాత్రమూ శ్రద్ధ లేదన్నారు. 'సూపర్ సిక్స్' హామీలు తూతూ మంత్రంగా అమలు చేసి ఏదో రాష్ట్రాన్ని బాగు చేశాం.. అభివృద్ధి చేశాం .. బ్రహ్మాండంగా పరిపాలన ఉంది అన్నట్టు సమావేశాలు నిర్వహిస్తున్నారని విమర్శించారు.ఈ మీటింగ్‌కు ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే రాష్ట్రం అప్పుల ఊబిలో ఉందంటూ, హామీలు అమలు చేయలేకపోతున్నామని చాలా సభల్లో మాట్లాడిన ముఖ్యమంత్రి చంద్రబాబు 'సూపర్ హిట్' సభకు కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ డబ్బును పేద ప్రజల బాగు కోసమో లేదంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీల కోసం ఉపయోగిస్తే బాగుంటుందని హితవు పలికారు. మీటింగ్ కోసం బడులకు సెలవు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.

న్యూస్‌రీల్

జిల్లాకు వర్షసూచన



అనంతపురం అగ్రికల్చర్: రాగల ఐదు రోజులు ఉమ్మడి జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి మంగళవారం విడుదల చేసిన బులెటిన్‌లో తెలిపారు. ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు మోస్తరు వర్షం పడే సూచన ఉందన్నారు. 10న ఒక మి.మీ, 11న 15 మి.మీ, 12న 8 మి.మీ, 13న 15 మి.మీ, 14న 13 మి.మీ మేర సగటు వర్షపాతం నమోదు కావొచ్చన్నారు. ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 33.7 డిగ్రీల నుంచి 34.1 డిగ్రీలు, కనిష్ఠం 23.3 డిగ్రీల నుంచి 23.4 డిగ్రీల మధ్య నమోదవుతాయన్నారు. గాలిలో తేమశాతం ఉదయం 76 నుంచి 80, మధ్యాహ్నం 50 నుంచి 52 శాతం మధ్య రికార్డు కావొచ్చన్నారు. పశ్చిమ దిశగా గాలులు గంటకు 13 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని తెలిపారు.

మైనార్టీ గురుకులంలో విద్యార్థి అదృశ్యం



విద్యార్థి గౌతమ్

గార్లదిన్నె: మండల కేంద్రంలోని ముస్లిం, మైనార్టీ గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థి అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం నగరానికి చెందిన సాకే గౌతమ్ గార్లదిన్నె ముస్లిం, మైనార్టీ గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం పాఠశాల నుంచి బయటకు వెళ్లిన గౌతమ్ తిరిగి రాలేదు. దీంతో పాఠశాల సిబ్బంది విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. అన్ని ప్రాంతాల్లో వెతికినా తల్లిదండ్రులకు ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

జిల్లాకు 800 మెట్రిక్ టన్నుల యూరియా

అనంతపురం అగ్రికల్చర్: ఇండియన్ పొటాష్ లిమిటెడ్ (ఐపీఎల్) కంపెనీ నుంచి 800 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు చేరినట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. మంగళవారం ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్ పాయింట్‌కు వ్యాగన్ల ద్వారా చేరిన యూరియా బస్తాలను ఆయన పరిశీలించారు. ఇండెంట్ల మేరకు ఉమ్మడి జిల్లాకు సంబంధించి మార్క్‌ఫెడ్‌కు 560 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్లకు 240 మెట్రిక్ టన్నులు సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

పశువుల మేతగా ఉల్లి, టమాట!



రోడ్డుపై పారబోసిన ఉల్లిగడ్డలు

తాడిపత్రి టౌన్: మార్కెట్‌లో ఉల్లి, టమాట దిగుబడులకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు పంటను పశువుల మేతగా వదిలేస్తున్నారు. మార్కెట్‌కు తరలించిన పంటకు గిట్టుబాటు ధర లభ్యం కాకపోవడంతో తాడిపత్రి మండలంలోని చుక్కలూరు సమీపంలో రోడ్డుపై రైతులు ఉల్లి, టమాట దిగుబడులను పారబోసి తమ దీనస్థితిని వ్యక్తం చేశారు. తాడిపత్రి నియోజకవర్గంలో 243 ఎకరాల్లో ఉల్లి, 515 ఎకరాల్లో టమాట పంటను రైతులు సాగుచేశారు. ఆరుగాలం శ్రమించి సాధించిన పంటల దిగుబడిని మార్కెట్‌కు తరలిస్తే కనీసం కిలో టమాట రూ.5, ఉల్లి రూ.10తో వ్యాపారులు అడుగుతున్నారని, ఈ లెక్కన అమ్మితే పెట్టుబడి కూడా చేతికి దక్కడం లేదంటూ వాపోయారు.

నేడు సీఎం చంద్రబాబు రాక

అనంతపురం అర్బన్: సీఎం చంద్రబాబు బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 1.30 గంటలకు జిల్లా కేంద్రంలోని అగస్త్య అపార్టుమెంట్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 1.45 గంటలకు అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకుంటారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సభలో పాల్గొంటారు. 4.40కు హెలికాప్టర్‌లో ఉండవల్లికి బయలుదేరి వెళతారు.

క్లుప్తంగా

యూరియా కోసం రైతుల ఆందోళన


అధికారులతో వాగ్వాదం చేస్తున్న రైతులు

కణేకల్లు: మండలంలోని కణేకల్లు క్రాస్‌లో ఉన్న కోరమాండల్ వద్ద మంగళవారం యూరియా కోసం రైతులు ఆందోళనకు దిగారు. కోరమాండల్‌కు ఒక లోడు (280 బస్తాలు) యూరియా రావడంతో మంగళవారం ఉదయం కణేకల్లు మండలంతో పాటు చుట్టుపక్కల మండల రైతులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. దీంతో చాలా మంది రైతులకు టోకన్లు దొరకలేదు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ వేచి ఉన్నా తమకు టోకన్లు ఇవ్వలేదంటూ రైతులు ఆందోళనకు దిగారు. కోరమాండల్ మేనేజర్ సోము సర్దిచెప్పే ప్రయత్నం చేయడంతో రైతులు వాగ్వాదానికి దిగారు. ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో తహసీల్దార్ బ్రహ్మయ్య, ఏఓ జగదీష్ అక్కడకు చేరుకున్నారు. దీంతో అధికారులను రైతులు నిలదీశారు. పక్క మండలాల రైతులను మినహాయించి స్థానిక మండల రైతులకు ఏఓ దగ్గరుండి ఒక్కొక్కరికి ఒక బస్తా చొప్పున ఇచ్చేలా టోకన్లు జారీ చేయించారు.

విద్యార్థులకు 'సూపర్' మోసం

- వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యార్థులను సూపర్ మోసం చేసిందని వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్ మండిపడ్డారు. బుధవారం జిల్లా పర్యటనకు వస్తున్న సీఎం చంద్రబాబు.. విద్యార్థి సమస్యలపై మాట్లాడాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదన్నారు. ఫలితంగా కోర్సులు పూర్తయినా కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం, వసతి కరువయ్యాయన్నారు. ఈ అంశంగా హైకోర్టు హెచ్చరించినా ప్రభుత్వంలో ఏమాత్రం మార్పు రాలేదన్నారు. పేద, మధ్య తరగతి వర్గాల విద్యార్థులు ఉచితంగా వైద్య విద్య అభ్యసించేందుకు వీలుగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి 17 మెడికల్ కళాశాలలు తీసుకొస్తే వాటిని ప్రైవేట్‌కు అప్పగించి వైద్యాన్ని మార్కెట్‌లో సరుకుగా మార్చేస్తున్నారని విమర్శించారు. విద్యార్థుల సమస్యలు బయటికి రాకుండా చీకటి జీఓను తెచ్చి మోసం చేశారన్నారు. డిగ్రీ ప్రవేశాలకు అనుమతులు ఇవ్వకుండా రాష్ట్రంలో విద్యా వ్యవస్థ నాశనమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గుంతకల్లు టౌన్: స్థానిక భాగ్య నగర్‌లో నివాసముంటున్న షమీమ్ ఇంట్లో చోరీ జరిగింది. సోమవారం రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలసి అల్లీపీరా కాలనీలోని బంధువుల ఇంటికి వెళ్లారు. తాళం వేసిన ఇంటిని గుర్తించిన దుండగులు లోపలకు చొరబడి బీరువాలోని 11 గ్రాముల బంగారు, రూ.20 వేల నగదు అపహరించారు. మంగళవారం ఉదయం చోరీ విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.




అనంతపురంలో వైన్‌షాపు ముందు తప్పతాగి రోడ్డుపై పడుకున్న మందుబాబు


మహిళలు ఉచితంగా ప్రయాణించడానికి వీల్లేకుండా 'అంతర్రాష్ట్ర సర్వీసు' బోర్డు పెట్టిన దృశ్యం


ఇటీవల ధర్మవరం రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయి సేవిస్తున్న యువకులు

సూపర్ వంచన

- తొలి ఏడాదిలో ఒక్క పథకానికీ పైసా ఇవ్వని బాబు సర్కారు
- ప్రజా ఒత్తిడి తట్టుకోలేక ఇటీవల అరకొరగా కొన్ని పథకాల అమలు
- అందులోనూ రెండు పథకాలు మొదలే పెట్టని వైనం
- కొందరికే సిలిండర్లు ఇచ్చి అందరికీ ఇచ్చామంటూ గొప్పలు
- 'తల్లికి వందనం' ఎంతమందికిచ్చారో చెప్పకుండా కుప్పిగంతలు
- బస్సులు తగ్గించడంతో నరకంగా మారిన ఉచిత ప్రయాణం
- ఊసే లేని 18 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు రూ.1,500 పథకం
- అటకెక్కిన 20 లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి
- అయినా 'సూపర్' హిట్ అంటూ సభ ఏర్పాట్లపై జనం ఆగ్రహం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలతో నమ్మించి లక్షలాది మంది సామాన్యులను, పేదలను మోసం చేసిన కూటమి సర్కారు..అన్నీ ఇచ్చేశామని, సూపర్‌సిక్స్ హామీలు సూపర్ హిట్ అయ్యాయని సభలు జరపడంపై సామాన్యులు నవ్వుకుంటున్నారు. చంద్రబాబు పేరు చెబితే ఏ పథకమూ సంపూర్ణంగా ఉండదు.. ఇదీ అంతే అంటున్నారు. తొలి ఏడాది సూపర్‌సిక్స్ పథకాల్లో దేనికీ పైసా ఇవ్వకుండా మభ్యపెట్టిన సర్కారు.. రెండో ఏడాది ప్రతిపక్షాల ఒత్తిడి, సామాన్యుల్లో ఆగ్రహజ్వాలలు తట్టుకోలేక అరకొర నిధులిచ్చి చేతులు దులుపుకుంది. దీనికిప్పుడు సూపర్‌హిట్ సభ అంటూ ప్రచారం చేయడం చంద్రబాబుకే చెల్లిందని జనంలో చర్చ జరుగుతోంది.

తల్లికి వందనం ఎంతమందికి?

తల్లికి వందనం తొలి ఏడాదికి డుమ్మా కొట్టారు. రెండో ఏడాదైనా అందరికీ ఇచ్చారా అంటే అదీ లేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1వ తరగతి నుంచి ఇంటర్ వరకూ 6.20 లక్షల మంది ఉన్నారు. వీళ్లలో ఎంతమందికి తల్లికి వందనం సొమ్ము పడిందో కలెక్టర్ల నుంచి డీఈఓల వరకూ ఎవరి దగ్గరా వివరాలు లేవు. దీనిపై కలెక్టర్లకు ఫిర్యాదులు వెల్లువెత్తుతుండగా డీఈఓకు పంపిస్తున్నారు. అక్కడికెళితే గ్రామ/వార్డు సచివాలయానికి పంపిస్తున్నారు. ఇదీ దుస్థితి.

మహిళలకు రూ.1500 ఊసే లేదు

సూపర్‌సిక్స్‌లో ప్రధాన హామీ 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పారు. 59 ఏళ్ల వరకూ అలా ఇస్తామన్నారు. కానీ ఇప్పటివరకూ ఏ ఒక్క మహిళకూ నయాపైసా ఇవ్వలేదు. ఉమ్మడి జిల్లా జనాభా 44 లక్షలు కాగా 18 నుంచి 59 ఏళ్లలోపు మహిళలు 15 లక్షల మంది ఉన్నారు. వీళ్లలో ఇప్పటివరకూ ఏ ఒక్కరికీ రూపాయి రాలేదు.

అన్నదాతకు రూ.5 వేలే..

ఎలాంటి షరతులు లేకుండా ప్రతిరైతుకు ఏడాదికి రూ.20 వేలు సాయం చేస్తామన్నారు. తొలి ఏడాది పూర్తిగా ఎగ్గొట్టి.. రెండో ఏడాది పీఎం కిసాన్ కింద రూ.2 వేలు అందితే కూటమి సర్కారు కేవలం రూ.5 వేలు ఇచ్చింది. ఇందులోనూ చాలామందికి పడలేదు. ఈ ఏడాది మరో మూడు వాయిదాలు చెల్లించాల్సి ఉంది. అది ఇస్తారో లేదో తెలియని పరిస్థితి. ఉమ్మడి జిల్లాలో 5.60 లక్షల మంది రైతులు ఉన్నారు. వీళ్లకు ఏడాదిన్నరలో రూ.5 వేలు ఇచ్చి సూపర్‌హిట్ అంటున్నారు.

ఊరికో ఉద్యోగమూ లేదు..

'20 లక్షల ఉద్యోగాలు.. ఇంటికో ఉద్యోగం ఇస్తాం లేదంటే నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి' అంటూ గొప్పగా చెప్పారు. ఎంటెక్, బీటెక్, డిగ్రీ, డిప్లొమా ఇలా కోర్సులు పూర్తయి నిరుద్యోగంతో అల్లాడి పోతున్నవారు ఉమ్మడి జిల్లాలో 7 లక్షల మందికి పైగా ఉన్నారు. వీళ్లలో ఇప్పటివరకూ ఎవరికీ నెలకు రూ.3వేలు కాదు కదా ముప్పై రూపాయలు కూడా ఇవ్వలేదు. కానీ నేడు జరిగే విజయోత్సవ సభలో ఇది హిట్ జాబితాలో ఉంది.

ఉచితం అని బస్సులు తగ్గించారు...

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మహిళలకు ఇచ్చిన ఉచిత ఆర్టీసీ ప్రయాణం నరకప్రాయంగా ఉంది. ఉచితం అన్నారు, బస్సులు భారీగా తగ్గించారు. ఉదాహరణకు అనంతపురం నుంచి కడపకు ప్రతి 30 నిముషాలకు ఒక బస్సు ఉండేది. ఇప్పుడు గంటకొకటి కూడా లేదు. అలాగే హిందూపురం నుంచి కొడికొండ వరకూ ప్రతి 20 నిముషాలకు బస్సుండేది. ఇప్పుడు 40 నిముషాలైనా లేదు. దీంతో డబ్బు పెట్టి పోదామన్నా బస్సులేక నరకం అనుభవిస్తున్నారు.

మూడు సిలిండర్లు ఎక్కడ?

ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు అని చెప్పారు కానీ ఎక్కడ ఇస్తున్నారు, ఎవరికి ఇస్తున్నారో తెలియని పరిస్థితి. రమారమి 12 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉంటే ఎంతమందికి ఉచిత సిలిండర్లు ఇచ్చారో ప్రభుత్వం లెక్కలతో చెప్పలేకపోతున్నది. దురదృష్టవశాత్తు ఇదికూడా 'హిట్' కొట్టింది.

సూపర్ సిక్స్ అమలు కాకపోగా..

- కొత్త మద్యం పాలసీ పేరుతో ఊరూరా బెల్టు షాపులు, పర్మిట్ రూములతో ఉమ్మడి అనంత జిల్లాను మత్తులో జోగేలా చేశారు.
- హిందూపురంలో బాలకృష్ణ పీఏల అండ చూసుకుని ఇసుక మాఫియా రెచ్చిపోతోంది.
- ఫ్యాక్షన్ హత్యలు మళ్లీ పురుడుపోసుకున్నాయి. రామగిరి మండలంలో లింగమయ్యను, రాప్తాడులో నారాయణరెడ్డి, ముత్యాలమ్మను టీడీపీ నేతలు దారుణంగా హత్య చేశారు.
- అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో కొండలు, గుట్టలు పిండిచేసి సహజ వనరులను 'పచ్చ' నేతలు లూటీ చేశారు.
- చిత్రావతి, పెన్నా, వేదవతి హగరి నదుల్లో ఇసుకను అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నా పట్టించుకునే దిక్కు లేదు.
- అనంతపురం అర్బన్‌లో ఎవరైనా ఇళ్లు కట్టాలంటే ఎమ్మెల్యేకు ప్రత్యేక ట్యాక్స్ కట్టాల్సిన దుస్థితి.
- తాడిపత్రి, ధర్మవరం, కదిరి, అనంతపురం... మట్కా, గంజాయిలకు అడ్డాగా మారాయి.
- గుత్తిలో ఓ వ్యక్తిని టీడీపీ నేతలు రైలు పట్టాలపై పడుకోబెట్టి బెదిరించి డబ్బు దండుకున్నారు.
- రాప్తాడులో వెంచర్లు, పరిశ్రమలు స్థాపిస్తే చాలు వారినుంచి ముక్కుపిండి సుంకం వసూలు చేస్తుండటంతో ఇక్కడకు రావడానికే భయపడుతున్నారు.

ఒక్క సిలిండరూ ఇవ్వలేదు



కూటమి ప్రభుత్వం వస్తే ప్రతి ఏడాది మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తామన్నారు. మేం ఇంత వరకు మూడు గ్యాస్ సిలిండర్లనూ డబ్బులు పెట్టి తీసుకున్నాం. ప్రభుత్వం నుంచి మాత్రం ఒక్క సిలిండర్‌కూ సబ్సిడీ డబ్బు మాకు అందలేదు.

– ఆదిలక్ష్మి, బూదేడు గ్రామం, గార్లదిన్నె మండలం

ప్రయాణం నరకంగా మారింది



ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ఉచితమంటున్నా ఆ మేరకు సౌకర్యాలు కల్పించక పోవడంతో నరకంగా మారింది. పథకం ప్రారంభించాక బస్సుల్లో మహిళలు అధిక సంఖ్యలో ప్రయాణిస్తున్నారు. అందుకు తగ్గట్టు బస్సులను ఏర్పాటు చేయకపోవడంతో గొడవలు చోటు చేసుకుంటున్నాయి.

– రేవతి, గృహిణి, తాడిపత్రి

హామీ ఎందుకు ఇచ్చారు?



ఆడబిడ్డ నిధి పథకం అమలు అయితే నా చదువులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని భావించా. అయితే కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయినా ఇప్పటి వరకూ అమలు చేయలేదు. హామీలు అమలు చేయలేనపుడు ఎందుకివ్వాలి? ఈ పథకాన్ని అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాలని మంత్రి అచ్చెన్నాయుడు అనడం బాధాకరం.

– సుమబిందు, బీఎస్సీ, విడపనకల్లు

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

- జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ
- మహిళ స్నేహపూర్వక గ్రామం – పంచాయతీ థీమ్ పై శిక్షణ ప్రారంభం


మాట్లాడుతున్న బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: మెరుగైన సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకంగా ఉంటోందని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. ఏపీ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 'మహిళ స్నేహపూర్వక గ్రామం-పంచాయతీ థీమ్-9' అంశంపై రెండు రోజుల శిక్షణ తరగతులు అనంతపురంలోని జెడ్పీ క్యాంపస్‌లో ఉన్న డీపీఆర్‌సీ భవన్‌లో మంగళవారం ప్రారంభమయ్యాయి. గిరిజమ్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంత మహిళల భద్రత, సమానత్వం, సమగ్రాభివృద్ధి వైపు ప్రోత్సహించే దిశగా కార్యక్రమాన్ని రూపొందించడం ఆనందంగా ఉందన్నారు. సమాజంలో సానుకూల మార్పుల కోసం పని చేసే దిశగా సమర్థవంతంగా తీర్చిదిద్దడమే శిక్షణ ఉద్దేశమని పేర్కొన్నారు. మహిళా స్నేహపూర్వక గ్రామ పంచాయతీ కింద జిల్లాలోని ఆరు మండలాల్లో ఒక్క పంచాయతీ చొప్పున మొత్తం ఆరు గ్రామ పంచాయతీలను ఎంపిక చేశామని సీఈఓ శివశంకర్ తెలిపారు. ఇందులో ఆత్మకూరు మండలంలో తోపుదుర్తి, బత్తలపల్లి మండలంలో బత్తలపల్లి, కంబదూరు మండలంలో చెన్నంపల్లి, కనగానపల్లి మండలంలో తగరకుంట, తాడిపత్రి మండలంలో ఊర చింతల, వజ్రకరూరు మండలంలో పాత కడమలకుంట గ్రామాలు ఉన్నాయన్నారు. ఒక్కో పంచాయతీ నుంచి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌ఓ, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్, ఏఎన్‌ఎం, వీఓ లీటర్లు ముగ్గురు చొప్పున ఒక్కో పంచాయతీ నుంచి మొత్తం తొమ్మిది మందిని ఎంపిక చేసి, వారికి రెండ్రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు డిప్యూటీ సీఈఓ జీవీ సుబ్బయ్య తెలిపారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను తమ పంచాయతీల్లో అమలయ్యేలా చూడాలని కోరారు.డీడీఓ నాగశివలీల, డీపీఆర్‌సీ శిక్షణ కేంద్రం జిల్లా మేనేజర్ నిర్మల్‌దాస్ పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్ట 'గంగ' పాలు


ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మద్యం దుకాణం

తాడిపత్రి టౌన్: మండలంలోని ఇగుడూరు గంగమ్మ ఆలయ ప్రతిష్టను దిగజార్చేలా స్థానిక టీడీపీ నేతలు వ్యవహరిస్తున్నారు. ఆలయానికి మంగళ, ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారు. అమ్మవారికి జంతు బలులతో మొక్కులు తీర్చుకుంటుంటారు. దీనిని ఆసరాగా చేసుకున్న టీడీపీ నేతలు.. అక్కడ ఓ షెడ్డు ఏర్పాటు చేసి ఏకంగా మద్యం దుకాణం తెరిచారు. ఈ విషయం తెలిసినా అధికారులు, పోలీసులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఆలయం వద్ద మద్యం అమ్మకాల కారణంగా తాగుబోతుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ఆలయ ప్రశాంతత దెబ్బతినడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆలయం వద్ద మద్యం విక్రయాలను ఆపాలని పలువురు మహిళలు కోరుతున్నారు.

రెండు పదుల వయస్సులోనే గుండెపోటు

- వివాహిత మృతి
- గ్రామంలో విషాదఛాయలు


నందిని మృతదేహంపై పడి రోదిస్తున్న అమ్మమ్మ లక్ష్మమ్మ

రాప్తాడు: రెండు పదుల వయస్సులోనే గుండెపోటుకు గురై ఓ వివాహిత మృతి చెందింది. ఘటనతో కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. వివరాలు.. రాప్తాడుకు చెందిన జానగొండ రాముడు, వెంకటలక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు భాస్కర్‌కు ఎం.చెర్లోపల్లి గ్రామానికి చెందిన బులగొండ నాగలక్ష్మి, నాగరాజు దంపతుల పెద్ద కుమార్తై నందిని (22)తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. సోమవారం సాయంత్రం కళ్లు తిరిగి కిందపడిపోయిన నందిని ని కుటుంబ సభ్యులు అనంతపురానికి పిలుచుకెళ్లి చికిత్స చేయించుకుని వచ్చారు. రాత్రి 10 గంటల సమయంలో మళ్లీ పడిపోవడంతో కుటుంబసభ్యులు స్థానిక ఆర్‌ఎంపీని పిలుచుకొచ్చి చూపించారు. పరిస్థితి విషమంగా ఉందని ఆర్‌ఎంపీ తెలపడంతో వెంటనే అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు సర్వజనాస్పత్రిలో చేర్పించారు. చికిత్సకు స్పందించక రాత్రి 11 గంటలకు నందిని మృతి చెందింది. 'లో బీపీ' కారణంగా గుండె పోటుకు గురై మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అర్ధరాత్రి మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ జూటూరు శేఖర్, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ జూటూరు లక్ష్మన్న, వైఎస్సార్ సీపీ నాయకులు సాకే చంద్ర, చింతకాయల జయన్న, టీడీపీ మండల కన్వీనర్ పంపు కొండప్ప, మాజీ కన్వీనర్ సాకే నారాయణ స్వామి, సర్పంచ్ సాకే తిరుపాలు తదితరులు నందిని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. మంగళవారం ఉదయం నందిని అంత్యక్రియలు నిర్వహించారు.

డీసీసీబీలో 'క్యూఆర్ కోడ్' సేవలు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)కు సంబంధించి ఇక నుంచి 'క్యూఆర్ కోడ్' సేవలు అందుబాటులోకి తెస్తున్నట్లు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక డీసీసీబీ హాలులో జరిగిన కార్యక్రమంలో మొదటి క్యూఆర్ కోడ్ రాచానపల్లి సొసైటీకి అందజేశారు. వచ్చే వారం నుంచి చిన్నా పెద్దా లేకుండా అన్ని రకాల వ్యాపార వాణిజ్యాలకు అకౌంట్ కలిగిన అందరికీ సదుపాయం కల్పిస్తామని తెలిపారు. రైతులకు ప్రాధాన్యత ఇస్తూనే ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా డీసీసీబీ పనిచేస్తుందన్నారు. అంతకు మునుపు ఆప్కాబ్ రాష్ట్ర అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, విజయనగరం డీసీసీబీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున డీసీసీబీ చైర్మన్‌తో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో సీఈవో కె.సురేఖారాణి, డీజీఎంలు సుఖదేవబాబు, విజయచంద్రారెడ్డి, రామప్రసాద్ పాల్గొన్నారు.

చేతి పంపు చుట్టూ రింగు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..


చేతి పంపు భద్రతకు ఏర్పాటు చేసిన రింగు

బొమ్మనహాళ్: మండలంలో కల్లుదేవనహళ్లి వద్ద హగరి నది పరివాహక ప్రాంతంలో ఉన్న చేతి పంపు భద్రతకు అధికారులు రింగులను ఏర్పాటు చేశారు. ఇసుక అక్రమ తవ్వకాలతో దాదాపు 8 అడుగుల మేర అందనంత ఎత్తునకు చేతి పంపు చేరుకుంది. ఈ నేపథ్యంలో చేతి పంపు విరిగి పోకుండా గ్రామస్తులు ఒడ్డున ఉన్న చెట్టు కొమ్మకు కట్టి అతి కష్టంపై తాగునీటి సేకరించుకోసాగారు. ఈ అంశాన్ని 'ఇసుకాసురల పాపం.. ఇదే సాక్ష్యం' శీర్షికన ఈ నెల 8న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎంపీడీఓ దాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ శ్రీనానాయక్ వెంటనే చర్యలకు ఉపక్రమించారు. చేతి పంపు విరిగిపోకుండా చుట్టూ రింగు ఏర్పాటు చేసి మంగళవారం ఉదయం సిమెంట్ కాంక్రీట్ వేశారు. అలాగే గ్రామస్తులు తాగునీటి పట్టుకునేందుకు వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

15 నుంచి 'గాలికుంటు' టీకాలు

అనంతపురం అగ్రికల్చర్: ఈ నెల 15 నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు నెల రోజులు పాటు జరిగే గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాల పోస్టర్‌ను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మంగళవారం విడుదల చేశారు. కార్యక్రమంలో జేడీ సుధాకర్, డీడీ రమేష్ రెడ్డి, ఏడీడీఎల్ ఏడీ రవిబాబు, డీఎల్‌డీఏ ఈవో వెంకటేష్, వీఏఎస్ గోల్డ్‌స్మన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్, స్ప్రింక్లర్ల పంపిణీ వేగవంతం చేయండి

- ఉద్యానశాఖ కమిషనర్ శ్రీనివాసులు


వీసీలో పాల్గొన్న ఏపీఎంఐపీ పీడీ, ఏపీడీ, డీసీఓలు

అనంతపురం అగ్రికల్చర్: డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరు ప్రక్రియ మరింత వేగవంతంగా కొనసాగాలని సంబంధిత అధికారులను ఉద్యానశాఖ కమిషనర్ కె.శ్రీనివాసులు, ఓఎస్డీ ఎం.వెంకటేశ్వర్లు ఆదేశించారు. డ్రిప్ పరికరాల పంపిణీపై మంగళవారం వారు విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. జిల్లా ఉద్యాన శాఖ కార్యాలయం నుంచి ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి, ఏపీడీ బీసీ ధనుంజయ, ఎంఐ ఇంజనీర్లు, కంపెనీ డీసీఓలు పాల్గొన్నారు. ప్రస్తుత 2025–26లో 18 వేల హెక్టార్లు టార్గెట్ కాగా ఇప్పటి వరకూ 4,011 మంది రైతులకు 5,402 హెక్టార్లకు మంజూరు చేశారని, ఇందులోనూ ఇన్‌స్టాలేషన్లు తక్కువగానే ఉన్నాయని అసహనం వ్యక్తం చేశారు. 31,804 హెక్టార్లకు రిజిస్ట్రేషన్ చేసుకున్న 22,650 మంది రైతులకు సంబంధించి సీనియార్టి వారీగా ప్రాథమిక పరిశీలన వేగవంతం చేయాలని ఆదేశించారు. వెనువెంటనే బీఓక్యూ, బీఎంసీ, రైతు వాటా కట్టించి వారం రోజుల్లోనే అడ్మినిస్ట్రేటివ్ అనుమతులతో రైతులకు మంజూరు ఉత్తర్వులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా జీఎస్టీ 12 నుంచి 5 శాతానికి తగ్గించిన నేపథ్యంలో మంజూరు చేసిన రైతుల పొలాల్లో ఈనెల 22 లోపు పరికరాలు బిగించాలన్నారు.

మోసం చేసి విజయోత్సవమా?

- సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ స్వామి ధ్వజం
- సీఎంకు బహిరంగ లేఖ


బహిరంగ లేఖను చూపుతున్న సీపీఐ నాయకులు

అనంతపురం అర్బన్: హామీలు అమలు చేయకుండా మోసం చేసి విజయోత్సవం జరుపుకోవడం ప్రజలను మభ్యపెట్టడంలో ఓ భాగంగా భావించాల్సి వస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి విమర్శించారు. సీపీఐ తరపున ముఖ్యమంత్రికి పంపిన బహిరంగ లేఖను మంగళవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో సీపీఐ సహాయ కార్యదర్శులు మల్లికార్జున, రాజారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ, కార్యవర్గ సభ్యులతో కలసి నారాయణస్వామి విడుదల చేసి, మాట్లాడారు. తల్లికి వందనం పథకం కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి, ఒక ఏడాది తరువాత రూ.13 వేలు మాత్రమే ఇవ్వడం మోసం కాదా? అని ప్రశ్నించారు. స్త్రీశక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తామని చెప్పి, ఏడాది తరువాత ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు మాత్రమే పరిమితం చేయడం వాగ్దాన భంగం కాదా? అన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తామని చెప్పి, కేంద్రం ఇచ్చే రూ.2 వేలతో కలిసి రూ.7 వేలు ఇవ్వడం రైతులను దగా చేయడం కాదా? అని నిలదీశారు. 19 నుంచి 59 ఏళ్ల ఉన్న మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1,500 ఇస్తామని హామీ ఇచ్చి ఒక్క రూపాయి కూడా జమ చేయకపోవడం, నాలుగు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి ఒక్క ఉద్యోగం కూడా భర్తీ చేయకపోవడం... నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తామని చెప్పి ఇవ్వకపోవడం చంద్రబాబు మోసాలకు నిదర్శనమన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం నిర్వహించేది సూపర్ హిట్ సభ కాదని, అది సూపర్ ఫ్లాప్ సభ అని దుమ్మెత్తి పోశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కేశవరెడ్డి, శ్రీరాములు, రమణ, సంతోష్‌కుమార్, రాజేష్‌గౌడ్, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐఆర్ 30 శాతం ప్రకటించాలి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు నీలూరి రమణారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి ఐఆర్ 30 శాతం వెంటనే ప్రకటించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం అనంతపురం రూరల్ మండలంలో 'సమస్యల సేకరణ - సభ్యత్వ స్వీకరణ' కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు నీలూరి రమణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు మాత్రం పట్టించుకోలేదన్నారు. పీఆర్సీ ఆలస్యమవుతున్నా పక్షంలో ఐఆర్ 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. దసరా కానుకగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు, పెన్షనర్స్‌కు డీఏలు ఇవ్వాలన్నారు. ఆర్జిత సెలవుల నగదు బకాయిలు విడుదల చేయాలని, మెడికల్ బిల్లులు మార్చి నుంచి పెండింగ్ లో ఉన్నాయని వాటిని విడుదల చేయాలన్నారు. సమగ్ర శిక్ష, కేజీబీవీల్లో పని చేస్తున్న ఉద్యోగులకు ఎంటీఎస్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు శివయ్య ఆచారి, డేనియల్ తదితరులు పాల్గొన్నారు.

14న కోటి కుంకుమార్చన

అనంతపురం కల్చరల్: మాతృదేవి విశ్వశాంతి ఆశ్రమం వారి ఆధ్వర్యంలో ఈనెల 14న లలిత పరమేశ్వరిదేవి కోటి కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆశ్రమంలో జరిగిన సమావేశంలో నిర్వాహకులు ప్రమోద్ కుమార్ స్వామి, శ్యామలమ్మ, సాయి, లహరిరాజ్ తదితరులు వివరాలను వెల్లడించారు. ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు స్థానిక టీటీడీ కల్యాణ మండపం వేదికగా సామూహిక కోటి కుంకుమార్చన జరుగుతుందని తెలిపారు. వివరాలకు 9490624747 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు



మాట్లాడుతున్న సీనియర్ శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యం

ఆత్మకూరు: చీనీ పంటలో మెలుకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని రేకులకుంట సీనియర్ శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యం రైతులకు సూచించారు. సిద్దరాంపురం గ్రామంలో మంగళవారం రైతులు చీనీసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట పెట్టినప్పటి నుంచి కోత దశకు వచ్చే వరకు ఏఏ మందులు పిచికారీ చేయాలో తెలియజేశారు. రైతులు తెగులు రాకనే ముందస్తుగా తగిన మోతాదులో మందులు పిచికారీ చేసుకుంటే అధిక దిగుబడి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి దివ్య. పి, యాలేరు అర్టికల్చర్ అసిస్టెంట్ నరసింహ, రైతులు పాల్గొన్నారు.

'బాబు పర్యటనను అడ్డుకుంటాం'

అనంతపురం టవర్‌క్లాక్: ఎన్నికల హామీలు అమలు చేయకుండా సూపర్‌హిట్ సభకు వస్తున్న సీఎం చంద్రబాబు పర్యటనను అడ్డుకుంటామని జైభీమ్‌రావు భారత్ పార్టీ అనంతపురం అర్బన్ ఇన్‌చార్జ్ నరేష్ కొడవండ్ల పేర్కొన్నారు. మంగళవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా నరేష్ కొడవండ్ల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన హామీలు అమలు చేయకనే సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభ ఏర్పాటు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమి నేతలు మాట్లాడే మాటలు ప్రజలు ఎవరూ నమ్మరన్నారు. చంద్రబాబు గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు రామప్ప నాయక్, బీకేఎస్ ఆనంద్, నాగరాజు, ఘట్టు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ముంబై సదస్సులో మేయర్ వసీం



ముంబై సదస్సులో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: ముంబైలోని వరల్డ్ కనెక్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన సదస్సులో అనంతపురం మేయర్ వసీం పాల్గొని ప్రసంగించారు. నగరాభివృద్ధితో పాటు నగర జీవన ప్రమాణాలు పెంచడంలో సాంకేతిక పరిజ్ఞానం ఎంతో కీలకంగా ఉంటుందని చెప్పారు. స్మార్ట్ సిటీస్-పట్టణాల్లో జీవన ప్రమాణాల మెరుగు అనే అంశంపై ఒక ప్యానెల్‌లో ఆయన వక్తగా వ్యవహరించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకువచ్చిన విప్లవాత్మక సంస్కరణలపై మేయర్ విపులంగా వివరించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పాలననందించిన విషయాన్ని గుర్తు చేశారు.

రైతుల కోసం ఎందాకైనా పోరాడుతాం



ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, మాజీ ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాజీ మంత్రి శైలజానాథ్ తదితరులు



అన్నదాత పోరు కార్యక్రమానికి తరలివచ్చిన రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- రైతులను నిర్లక్ష్యం చేస్తే ఊరుకోం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి
- నగరంలో హోరెత్తిన అన్నదాత పోరు
- భారీ సంఖ్యలో హాజరైన అనంతపురం, రాప్తాడు, శింగనమల, తాడిపత్రి రైతులు, పార్టీ శ్రేణులు

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు అండ్ కో రైతులను కష్టాల నుంచి గట్టెక్కించే ఆలోచన ఏమాత్రమూ చేయకపోగా అవహేళన చేశారని, వారి కోసం ఎందాకైనా పోరాడుతామని, వీలైతే ప్రభుత్వాన్నే స్తంభింపజేస్తామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం వద్ద నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమం దిగ్విజయమైంది. అనంతరపురంతో పాటు శింగనమల, రాప్తాడు, తాడిపత్రి నియోజకవర్గాల నుంచి భారీగా రైతులు, పార్టీ శ్రేణులు తరలివచ్చారు. ఎమ్మెల్సీలు వై శివరామిరెడ్డి, మంగమ్మ, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలు డాక్టర్ సాకే శైలజనాథ్, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, పెద్దారెడ్డి, పార్టీ అనంతపురం పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌రెడ్డి, మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర ప్రసాద్ రెడ్డి, పీఏసీ సభ్యులు మహాలక్ష్మి శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్, తదితరులతో కలసి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ర్యాలీచేపట్టారు. ఉదయమే ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న ప్రాంతమంతా రైతులు, పార్టీ శ్రేణులతో నిండిపోయింది. అనంతరం ఆర్ట్స్ కళాశాల నుంచి క్లాక్‌టవర్ మీదుగా రఘువీరా కాంప్లెక్స్, లలిత కళాపరిషత్ వీధిలో నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. కూటమి ప్రభుత్వం 15 నెలల్లో రైతులకు పెట్టిన ఇబ్బందులను ప్లకార్డుల ద్వారా ప్రదర్శించారు. స్పెషల్ పార్టీ పోలీసుల బందోబస్తు మధ్య ర్యాలీ సాగింది. వైఎస్సార్ సీపీ శ్రేణులు క్రమశిక్షణ. శాంతియుతంగా ర్యాలీలో ముందుకుసాగారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలోకి అనంత వెంకటరామిరెడ్డి, సమన్వయకర్తలు వెళ్లి ఆర్డీఓ కేశవ నాయుడుకు వినతి పత్రం అందజేశారు.

బ్లాక్ మార్కెట్‌కు యూరియా

ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులకు నాణ్యమైన విత్తనాలను అందివ్వలేకపోయారన్నారు. సీజన్ ప్రారంభంలోనే డిస్ట్రిబ్యూటర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలసి యూరియాను బ్లాక్‌మార్కెట్‌కు తరలించారని ఆరోపించారు. గతంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ఏ సీజన్‌లో పంట నష్టపోతే అదే సీజన్‌లో రైతులను ఆదుకునేవారని గుర్తు చేశారు. చీనీ, అరటి, ఉల్లి, టమాట..ఇలా ఏ పంటకూ గిట్టుబాటు ధర లేక రోడ్లపై పారేసే పరిస్థితి దాపురించిందన్నారు.

కుప్పంకు నీరివ్వాలని పస్తు పెడితే ఎలా?

హంద్రీనీవా నుంచి నీరు వస్తున్నా..ఇక్కడి చెరువులకు నీరు ఇవ్వకుండా కుప్పానికి తీసుకెళ్లారని, ఇక్కడి రైతుల పొట్టగొట్టడం ఏంటని అనంత ప్రశ్నించారు. తాము కుప్పానికి నీరు ఇవ్వడానికి వ్యతిరేకం కాదని, మమ్మల్ని పస్తు పెట్టి తీసుకెళ్లడం న్యాయమా అని ప్రశ్నించారు. హంద్రీ-నీవా వెడల్పు చేయడంతో పాటు హెచ్ఎల్‌సీని ఆధునీకరించాలన్నారు. తుంగభద్ర నుంచి నీరు విడుదలైన నేపథ్యంలో తక్షణం హెచ్ఎల్‌సీ నార్త్, సౌత్ కెనాళ్లకు నీటిని విడుదల చేయాలన్నారు. రైతులు పండించే అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు.

డబ్బా కొట్టుకునేందుకు బాబు పర్యటన

'పథకాలు వెబ్‌సైట్‌లో నిల్చిపోయాయని, కేవలం డబ్బా కొట్టుకునేందుకే చంద్రబాబు జిల్లా పర్యటనకు వస్తున్నారని, రైతులకు యూరియా ఇచ్చిన తర్వాతనే చంద్రబాబు అనంతపురంలో అడుగు పెట్టాలని వైఎస్సార్‌సీపీ రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. హంద్రీ-నీవా లైనింగ్ పనులు చేసిన నాలుగు లక్ష ఎకరాలకు ఎండబెట్టారన్నారు. 20 టీఎంసీల నీరు మిగిలిచ్చే గండికోట హంద్రీనీవా లింక్ కెనాల్‌ను మూసి వేశారన్నారు. రైతులకు ద్రోహం చేసిన చంద్రబాబు యూరియాను అనంతకు ఇచ్చి ప్రాయశ్చిత్తం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, పార్టీ పంచాయితీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్ర రెడ్డి, టీటీడీ మాజీ బోర్డు సభ్యులు అశ్వర్థ నాయక్, ఐడీసీ మాజీ చైర్మన్ కే నల్లప్పరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు నారాయణరెడ్డి, శ్రీదేవి, మల్లెమీద నరసింహులు, శ్రీనివాసులు నాయక్, బాకే హబీబుల్లా, ఎద్దుల అమర్‌నాథ్ రెడ్డి, సైపుల్లాబేగ్, ఓబిరెడ్డి, సాకే చంద్రశేఖర్, చంద్రశేఖర్ యాదవ్, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు, రాష్ట్ర నాయకులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, ఎగ్గుల శ్రీనివాసులు, మారుతీనాయుడు, వెన్నం శివరామిరెడ్డి, గోకుల్ రెడ్డి, రంగంపేట గోపాల్ రెడ్డి, నార్పల సత్యనారాయణ రెడ్డి, చామలూరు రాజగోపాల్, మీసాల రంగన్న, మదిరెడ్డి నరేంద్ర రెడ్డి, కృష్ణవేణి, ఖాజా, బాబా సలాం, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, నాయకులు అనంత చంద్రారెడ్డి, దేవి, భూమిరెడ్డి జాహ్నవి, భారతి, శోభారాణి, శోభాబాయి, ఉష, గువ్వల శ్రీకాంత్ రెడ్డి, చింతకుంట మధు, తనీష, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, ఇసాక్, సంపంగి రామాంజనేయులు, సాకే చంద్రలేఖ, తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓతో మాట్లాడుతున్న అనంత, మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు వైఈపీ రెడ్డి, మాజీ మంత్రి సాకే శైలజానాథ్, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



రైతులకు న్యాయం చేయాలని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మహిళా నేతలు



ఆర్డీఓ కార్యాలయం వద్ద రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులను అడ్డుకున్న పోలీసులు



ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి వస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ప్రచార ఆర్భాటం తప్ప పథకాల అమలేదీ?

- వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాకే ఉమామహేష్

అనంతపురం టవర్‌క్లాక్: సీఎం చంద్రబాబు ప్రచార ఆర్భాటం తప్ప పథకాల అమలుపై చిత్తశుద్ధి లేదని వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాకే ఉమా మహేష్ విమర్శించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా సూపర్ సిక్స్ సూపర్ హిట్ పేరుతో సభ ఏర్పాటు చేయడం సిగ్గు చేటన్నారు. సూపర్‌సిక్స్ పథకాల అమలుపై మాట్లాడిన వారి నాలుక మందం అంటూ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానిస్తున్నారన్నారు. తల్లికి వందనం పథకం పూర్తి స్థాయిలో అమలు చేశామని చెబుతున్నారని, పదో తరగతి విద్యార్థులకు పథకం అందిందో లేదో చూడాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిధులతో కలిపి అమలు చేశారని, అందులోనే చాలామంది రైతులకు మొండిచేయి చూపారన్నారు. ఉచిత బస్సంటూ కొన్నింటిలో మాత్రమే అనుమతిస్తున్నారన్నారు. ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితం కూడా సక్రమంగా అమలు కాలేదని గుర్తు చేశారు. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి పథకాల ఊసే లేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండానే గొప్పల కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను తరలించి విజయోత్సవం జరుపుకోవాలని చూడడం తగదన్నారు. డ్వాక్రా మహిళలను బలవంతంగా సభకు తరలించాలని కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని, ఇలాంటి సభలకు ఇష్టపూర్వకంగా ఎవరు రారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు సాకే రాజు, నాయకులు సాకే రమణ, సాకే అరుణ్, సాకే కృష్ణ, రసూల్, ఆఫ్రీద్ , అబ్బాస్, నూరు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ల నిఘా నీడలో సభ



పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న అడిషనల్ డీజీపీ మధుసూదన్‌రెడ్డి

అనంతపురం: సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొంటున్న బహిరంగ సభలో 55 డ్రోన్లతో నిఘా పెట్టారు. ఈ సభ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 250 నూతన కెమెరాలతో కలుపుకుని, ఇది వరకే ఉన్న నగరంలో 400 సీసీ కెమెరాలు వినియోగించారు. శాంతి భద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ, నేర నియంత్రణపై ప్రధాన దృష్టి సారించారు. నిఘా విభాగానికి ఇన్‌చార్జ్ డీఐజీ అధికారిగా సత్యఏసుబాబు పర్యవేక్షించారు.

సీఎం పర్యటన నేపథ్యంలో భద్రతా సమీక్ష

అనంతపురం పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో అడిషనల్ డీజీపీ మధుసూదన్‌రెడ్డి (శాంతిభద్రతలు) భద్రతను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన పోలీసు ఉన్నతాధికారులకు పలు సూచనలు చేశారు. సభాస్థలి, వేదిక, హెలీప్యాడ్, పార్కింగ్ స్థలాల వద్ద బందోబస్తు, హైవేపై ట్రాఫిక్ మళ్లింపు పాయింట్లను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, డ్రోన్స్‌తో నిఘాను సమీక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని సెక్టార్ల అధికారులకు సూచనలు చేశారు. సమీక్షలో ఆపరేషన్స్ ఐజీపీ సీహెచ్ శ్రీకాంత్, అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షిమోషి, డీఐజీలు సెంథిల్ కుమార్, కోయ ప్రవీణ్, గోపీనాథ్ జెట్టి, అమ్మిరెడ్డి, విజయరావు, బి. సత్య యేసుబాబు, డాక్టర్ పక్కీరప్ప కాగినెల్లి, కేకేఎన్ అన్బురాజన్, ఉమ్మడి అనంతపురం జిల్లాల ఎస్పీలు పి. జగదీష్, రత్న తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశించిన ప్రాంతాల్లోనే పార్కింగ్

సూపర్ సిక్స్- సూపర్ హిట్ సభకు వచ్చే వాహనాలు పోలీసులు సూచించిన మార్గాల ద్వారా కేటాయించిన పార్కింగ్ ప్రదేశాలకు నేరుగా వెళ్లాలని జిల్లా ఎస్పీ పి. జగదీష్ సూచించారు.

- ఉరవకొండ నియోజకవర్గం నుంచి వచ్చే వాహనాలు కూడేరు మీదుగా బళ్లారి బైపాస్, తపోవనం సర్కిల్ నుంచి హైవే మీదుగా సభకు సమీపంలో కేటాయించి ప్రాంతాల్లో పార్కింగ్ చేయాలి.
- రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల నుంచి వచ్చే వాహనాలు ఆత్మకూరు మీదుగా కళ్యాణదుర్గం బైపాస్ అండ్ పాస్, సర్వీస్ రోడ్డు, రవి పెట్రోల్ బంకు వద్ద హైవేలో ప్రవేశించాలి.
- గుత్తి, గుంతకల్లు నుంచి వచ్చే వాహనాలు గార్లదిన్నె మీదుగా హైవేలో ప్రవేశించి సభకు సమీపంలోకి వెళ్లాలి.
- తాడిపత్రి నుంచి వచ్చే వాహనాలు 544-డీ జాతీయ రహదారిపై ప్రవేశించి వడియంపేట, నేషనల్ హైవే-44 పై ప్రవేశించి విజయోత్సవ సభకు సమీపంలో కేటాయించిన పార్కింగ్ స్థలాలకు వెళ్లాలి.
- శింగనమల, బుక్కరాయసముద్రం నుంచి వచ్చే వాహనాలు కలెక్టర్ ఆఫీసు, పంగల్ రోడ్డు, రాప్తాడు వై జంక్షన్ వద్ద నేషనల్ హైవే -44 పై ప్రవేశించాలి.
- శ్రీ సత్యసాయి జిల్లా నుంచి, కదిరి, బత్తలపల్లి, ముదిగుబ్బ, తాడిమర్రి నుంచి వచ్చే వాహనాలు సేతు స్కూల్ సమీపంలోని బైపాస్ జంక్షన్, రాప్తాడు, వై జంక్షన్ మీదుగా సభకు రావాలి.

'అన్నదాత పోరు'లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



చెన్నేకొత్తపల్లి వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడు: రైతులను దగా చేసిన సీఎం చంద్రబాబుకు బుద్ధి చెప్పేందుకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం అనంతపురంలో చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి రాప్తాడు మండలం నుంచి రైతులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీ స్థాయిలో అనంతపురం తరలివెళ్లారు. వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, మండల కన్వీనర్ సాకే వెంకటేష్, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ జూటూరు లక్ష్మన్న, మండల యూత్ కన్వీనర్ విశ్వనాథ్ రెడ్డి, మాజీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మాజీ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షురాలు ఉషా రాణి, మహిళ మండల కన్వీనర్ వరలక్ష్మీ ఆధ్వర్యంలో రైతులు, రైతు సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీ స్థాయిలో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియా, ఎరువుల కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా సీఎం చంద్రబాబు, కూటమి ప్రజా ప్రతినిధులకు చీక కుట్టినట్లు కూడా లేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండట్టేందుకే అన్నదాత పోరు కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు.

చెన్నేకొత్తపల్లి: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమానికి మండల నుంచి ఆ పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. న్యామద్దెల, ముష్టికొవెల, వెంకటంపల్లి తదితర గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు చెన్నేకొత్తపల్లికి చేరుకొని స్థానిక న్యామద్దల సర్కిల్ ఉన్న దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రత్యేక వాహనాల్లో అనంతపురం తరలి వెళ్లారు.

ముగిసిన రాష్ట్రస్థాయి నాటక పోటీలు



బహుమతి అందుకుంటున్న కర్నూలు కళాకారులు

అనంతపురం కల్చరల్: భగవాన్ సత్యసాయి నాటకోత్సవ సమితి ఆధ్వర్యంలో స్థానిక కృష్ణకళామందిరం వేదికగా ఐదురోజుల పాటు సాగిన రాష్ట్రస్థాయి నాటక పోటీలు మంగళవారం ముగిశాయి. కర్నూలు వారి 'జగదేకసుందరి సామా' నాటకం, హైదరాబాదుకు చెందిన సురభి కళాకారుల 'భక్తప్రహ్లాద', ' అయ్యప్పస్వామి' పద్యనాటకాలు వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. దక్షిణ భారత సాంస్కృతిక మండలి మాజీ సభ్యులు మైకేల్‌బాబు, దివాకర్ నేతృత్వంలో సాయంత్రం సాగిన ముగింపు సమావేశంలో డీఆర్వో మలోల హాజరై కళాకారులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలనందించారు. సామాజిక సేవా కార్యకర్తలు రవికాంత్ రమణ, రాజేంద్రనాయుడు, ఉమర్, సీనియర్ రంగస్థల కళాకారులు బండి నారాయణస్వామి, ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ అనంతలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం ద్వారా రానున్న రోజుల్లో నాటకాలను ప్రోత్సహించేలా చేశారని కొనియాడారు. సాయంత్రం సమావేశంలో అనంతనాగ్ సంగీత్ స్వర్గ్ కల్చరల్ అసోసియేషన్ నాగినీప్రసాద్ ఆధ్వర్యంలో సంగీత విభావరి వీనుల విందుగా సాగింది. గాయనీ గాయకులు ఆ పాత మధురాలతో ఆకట్టుకున్నారు. సీనియర్ గాయకులు శ్రీదేవి, లక్ష్మీనారాయణ, రామయ్య, సుధాకరబాబు, పాలసముద్రం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ సభలో సేవ్ ఆర్డీటీపై మాట్లాడాలి

అనంతపురం టవర్‌క్లాక్: సూపర్ సిక్స్ సభలో సీఎం చంద్రబాబు సేవ్ ఆర్డీటీపై మాట్లాడాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఫాదర్ ఫెర్రర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ పేదలకు ఎంతో సహకారం అందిస్తున్న ఆర్డీటీకి నిధులు రాకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకోవడం దారుణం అన్నారు. తక్షణమే నిధులు విడుదల చేయాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు సభలో దీనిపై స్పష్టత ఇవ్వాలన్నారు. లేని పక్షంలో ఛలో ఢిల్లీ కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు కేపీ రాజు, సుగమంచి శ్రీనివాసులు, సాకే మునలయ్య, శివన్న, గోవర్దన్, రామకృష్ణ, సూర్యనారాయణ, ప్రసాద్, శ్రీధర్, నరేంద్ర, హరి, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉద్యోగులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్: తమ విద్యా సంస్థల్లో చదివే ప్రతి విద్యార్థిని ఉద్యోగులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పీవీకేకే కళాశాల చైర్మన్ పల్లె వెంకటకృష్ణకిశోర్ అన్నారు. మంగళవారం పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో ఎస్‌వీహెచ్ ఇండియా ఆటోమొబైల్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో పలువురు విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయి. ఈ సందర్భంగా పల్లె వెంకటకృష్ణకిశోర్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి వార్షిక వేతనం రూ.3 లక్షలు ఉంటుందని, వీరు పెనుకొండ కియా కంపెనీలో గ్రాడ్యుయేట్ ఇంజినీర్లుగా పని చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE DISTRICT JUDGE, ANANTHAPURAMU

(In the matter of obtaining permission to Sell the property of Minors Gasti Tasneem Suhana, Shaik Gasti Sakeena Salsabeel and Gasti Zaiba Safeena)

G.W.O.P. No. 39/2025

Between
Gasti Vaheeda Begum ... Petitioner
and
Nil ... Respondent

ప్రకటన

పై నెంబరు కేసులో మైనరు పిల్లలు అయిన గస్తీ తస్నీమ్ సుహానా, షేక్ గస్తీ సకీనా సల్సాబీల్ మరియు గస్తీ జైబా సఫీనా తరఫున వారి తల్లిగారు అయిన గస్తీ వహీదా బేగం పై కోర్టు నందు మైనరు పిల్లల యొక్క ఆస్తిని వారి పోషణ కొరకు, విద్యాభివృద్ధికి, కుటుంబ నిర్వహణ ఖర్చుల నిమిత్తము మరియు లోకుల నుండి చేసిన అప్పులను తీర్చుట కొరకు పిటీషన్ దాఖలు చేసి ఉన్నారు. కావున సదరి కేసులో ఎవరికైనా ఎలాంటి ఆక్షేపణలు ఉన్న యెడల స్వతహాగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట 07-10-2025వ తేది ఉదయం 10-30 గంటలకు హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు పిటీషనర్ పరమున తీర్మానింతురు అని తెలియచేయడమైనది.

SCHEDULE

Property situated within the RD of Ananthapuramu and SRD of Ananthapuramu within the Ananthapuramu Village Polam, Ananthapuramu Rural Panchayath Area, Ananthapuramu Mandal, Ananthapuramu District.
Govt.Dry, Sy.No. 368, A.C. 9-31 Paiki A.C. 0.08 Cents or 0.032 HS Plot No : 55 & 56,
Bounded by : East : Plot No. 57, **South :** Plot No. 42 & 43, **West :** Road ; **North :** 25 Feet Road,
Measuring : East-West : 100 Links or 20.12 Mtrs, **North-South :** 80 Links or 16.10 Mtrs.

"కోర్టు వారి ఉత్తర్వుల మేరకు"

V. BHARADWAJA PADMANABHA TEJA
Advocate, Ananthapuramu. Cell : 9700713342

పంజాబ్ నేషనల్ బ్యాంక్ | **CIRCLE OFFICE SAM**

E Mail: cs8332@pnb.co.in. Land Line- 0866-2428160

స్వాధీనత ప్రకటన

[illegible]

సెక్యూరిటీల వివరములు

[illegible]

తేది : 04.09.2025
ప్రదేశం : అనంతపురం

సం/- అధీకృత అధికారి
పంజాబ్ నేషనల్ బ్యాంక్